సాక్షి
విశాఖపట్నం
7
ఆదివారం | 24 | నవంబర్ | 2024



గజ్జె ఘల్లుమంది
- ఆకట్టుకున్న ఆదివాసీ స్వాభిమాన్ ఉత్సవాలు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- గిరిజన ఉత్పత్తులకు ఆదరణ 8లో

ఇసుకపై ప్రైవేటు పెత్తనం!

డిపోలన్నీ టీడీపీ నేతలకే అప్పగింత

- స్థానిక నేతలకు సంబంధం లేకుండా అమరావతి నుంచే ఆదేశాలు
- ముఖ్యనేతతో పాటు మైనింగ్ మంత్రి హస్తం
- ప్రభుత్వ ఇసుక డిపోల స్థానంలో ప్రైవేటు డిపోలు
- విశాఖలో 3, అనకాపల్లిలో 6 ప్రాంతాల్లో ఏర్పాటు

ఉచిత ఇసుక పేరుతో కూటమి ప్రభుత్వం సొంత పార్టీ నేతల జేబులు నింపుతోంది. ఇప్పటివరకు రీచ్‌లు లేని ప్రాంతాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక డిపోల స్థానంలో ప్రైవేటు ఇసుక డిపోల ఏర్పాటుకు సిద్ధమైంది. ఈ ప్రైవేటు ఇసుక డిపోలను సొంత పార్టీకి చెందిన ప్రైవేటు సంస్థలకు అప్పగించేసింది. పైకి టెండర్లని చెప్పినా తెరవెనుక తమకు ఇష్టమైన సంస్థలకే టెండర్లు దక్కేలా వ్యవహారాలు నడిపారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు ఎకరాల స్థలం సొంతం/లీజుకు ఉండటంతో పాటు రవాణా వాహనాలు కలిగిన సంస్థలు టెండర్లు పాల్గొవచ్చంటూ నిబంధనలు రూపొందించారు. అయితే స్థలాన్ని లీజుకు తీసుకున్నట్లు స్థానిక రెవెన్యూ అధికారులు నిరంభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీచేయాల్సి ఉంటుంది. అయితే రెవెన్యూ అధికారుల ద్వారా ఇష్టమైన వారికి ఎన్‌వో సీలు ఇప్పించి టెండర్లు దక్కేలా చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:



విశాఖ జిల్లాలో భీమిలి, గాజువాక, ముడసర్లోవ ప్రాంతాల్లో ప్రైవేటు ఇసుక డిపోల ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించారు. గాజువాక ఇసుక డిపో కాంట్రాక్టును నాగేంద్ర ఇన్ఫ్రాకు, ముడసర్లోవ ఇసుక డిపో బాధ్యతలను నన్నపనేని ఎర్త్ మూవర్స్, భీమిలి ఇసుక డిపో కాంట్రాక్టును మిషి ఇన్ఫ్రా కంపెనీలకు అప్పగిస్తూ ఈ నెల 23వ తేదీన జిల్లా యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. ఇందులో నాగేంద్ర ఇన్ఫ్రా సంస్థకు చెందిన వ్యక్తులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక విధానంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో కేసు వేసిన వారిగా తెలుస్తోంది. మరోవైపు ఈ మూడు సంస్థలకు అధికార టీడీపీ ప్రభుత్వ పెద్దల అండదండలున్నట్లు సమాచారం. స్థానిక నేతలకు ఏ మాత్రం సంబంధం లేకుండా.. ముఖ్యనేతతో పాటు మైనింగ్‌శాఖ మంత్రి అండదండలతోనే ఈ సంస్థలకు టెండర్లు దక్కినట్టు తెలుస్తోంది. మరోవైపు అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, నక్కపల్లి, అచ్యుతాపురంలో ప్రైవేటు ఇసుక డిపోలకు ఈ నెల 20వ తేదీన టెండర్లను ఆహ్వానించగా 29వ తేదీన ఫైనల్ చేయనున్నారు. ఇక్కడ కూడా అధికార పార్టీకి చెందిన సంస్థలకే టెండర్లు దక్కేలా వ్యవహారాలు నడుస్తున్నట్టు తెలుస్తోంది.

దరఖాస్తుతో ఎన్‌వోసీ ఇవ్వకపోయినా..!

ప్రైవేటు ఇసుక డిపోల కోసం పిలిచిన టెండర్లకు దరఖాస్తుతో పాటు ఇసుక డిపో ఏర్పాటు చేసే ప్రాంతానికి సంబంధించిన ఎన్‌వోసీ సమర్పించాల్సి ఉంటుంది. అయితే గాజువాక ఇసుక డిపో వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారం నడిచిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గాజువాకలో ప్రైవేటు ఇసుక డిపో ఏర్పాటు కోసం నాగేంద్రే ఇన్ఫ్రా సంస్థ ఎన్‌వోసీకి ఈనెల 12వ తేదీన దరఖాస్తు చేసుకుంది. ఆ సమయంలో స్థలం లీజు అగ్రిమెంట్ డాక్యుమెంట్ ఇవ్వలేదు. సదరు రైతుతో సంస్థ 14వ తేదీన లీజు అగ్రిమెంటు చేసుకుంది. అదే రోజున ఆగమేఘాల మీద ఎన్‌వోసీ జారీ చేయడంతో పాటు సదరు తహసీల్దార్ సెలవులో ఉండటంతో డిప్యూటీ తహసీల్దార్‌తో పనికానిచ్చినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఇసుక డిపో నగరానికి వెలుపల భారీ లారీలు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఉండాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం జనావాసాలు, సినిమా థియేటర్లు ఉండటంతో పాటు లారీలు వెళ్లేందుకు రెండు భారీ ట్రాఫిక్ సిగ్నల్స్ దాటి వెళ్లాల్సి ఉంది. అంటే పగలు సమయాల్లో ఇసుక లారీల రాకపోకల వల్ల ఈ ప్రాంతంలో మరింతగా రద్దీ పెరగనుంది. తద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడతాయి. ఇవేవి పట్టించుకోకపోవడం వెనుక సదరు శాఖ మంత్రితో పాటు విజయవాడ నుంచే మొత్తం వ్యవహారం చక్రం తిప్పినట్టు తెలుస్తోంది.

అయినవారికే ఎన్‌వోసీలు..!



వాస్తవానికి జిల్లాలో మూడు ప్రాంతాల్లో ఇసుక డిపోల ఏర్పాటు కోసం పలువురు ఆసక్తి చూపారు. 10 నుంచి 17 సంస్థల వరకు ఇసుక డిపోల ఏర్పాటు కోసం దరఖాస్తులను సమర్పించారు. అయితే, ఇసుక డిపో ఏర్పాటు కోసం 4 ఎకరాల స్థలాన్ని రైతుల నుంచి లీజు తీసుకునేందుకు ఆయా సంస్థలు సమర్పించిన పత్రాలకు స్థానిక తహసీల్దార్లు నిరంభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే ముందుగానే పక్కాగా ఫలానా సంస్థలకే ఈ ప్రైవేటు ఇసుక డిపోలను ఇవ్వాలనే ఆదేశాలు ఉండటంతో వారికి మాత్రమే ఎన్‌వోసీలు జారీ చేసినట్టు విరమ్శలు గుప్పుమంటున్నాయి. ఈ మేరకు అమరావతి నుంచే మొత్తం ఆదేశాలు వచ్చినట్టు రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రధానంగా కీలకమైన మంత్రితో పాటు సదరు శాఖకు చెందిన మంత్రి నుంచి వచ్చిన ఆదేశాలే ఇందుకు కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు సొంత స్థలం ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే.. ఎన్‌వోసీ కోసం ఆయా రెవెన్యూ అధికారులు రూ.10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకూ వసూలు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విధంగా ఎన్‌వోసీ తెచ్చుకున్న సంస్థలను సాంకేతిక కారణాలు చూపుతూ అనర్హత వేటు వేయగా... మరోవైపు టెండరు దక్కే అవకాశం ఉన్న ఓ సంస్థకు సొంతంగా 7 ఎకరాలు ఉన్నప్పటికీ 4 ఎకరాల స్థలం కూడా లేదంటూ ఎన్‌వోసీ ఇచ్చేందుకు స్థానిక రెవెన్యూ అధికారులు కొర్రీలు వేశారు. తద్వారా సదరు సంస్థ టెండర్‌లో అర్హత సాధించకుండా కథ నడిపించారు. మొత్తంగా తాము అనుకున్న సంస్థలకే ప్రైవేటు ఇసుక డిపో ఏర్పాటుకు అవకాశం కల్పించేలా పక్కా ప్లానింగ్‌తో వ్యవహారం నడిచిందని అర్థమవుతోంది.

చట్టాలు, హక్కులపై అవగాహన అవసరం

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- ఎస్సీ, ఎస్టీ (పీవోఏ) చట్టంపై అవగాహన సదస్సు



ప్రసంగిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఏయూక్యాంపస్: చట్టాలు, హక్కులపై అవగాహన **కలిగి ఉంటే.. మనల్ని మనం పరిరక్షించుకోవడం సులువని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్** శంఖబ్రత **బాగ్చి అన్నారు. బీచ్‌రోడ్డులోని ఏయూ** సాగరిక కన్వె**న్షన్ సెంటర్‌లో క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్(సీఐడీ) ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ (పీవోఏ)** చట్టంపై శని**వారం అవగాహన సదస్సు జరిగింది.** ముందుగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం 'విద్య, అవగాహనతో షెడ్యూల్ ట్రైబ్ కమ్యూనిటీల సాధికారత'అంశంపై యువతనుద్దేశించి మాట్లాడారు. చట్టాలపై అవగాహన ఉంటే.. చట్టాలను ఉల్లఘించే వారికి గుర్తించడం సాధ్యపడుతుందన్నారు. షెడ్యూల్ తెగల పరిరక్షణ, సంరక్షణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక చట్టాలను ప్రతీ పౌరుడు తెలుసుకోవాలని సూచించారు. ఆదివాసీ చట్టాలు, అటవీ చట్టం 2006 తదితర అంశాలపై నిపుణులు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎస్టీలకు అవసరమైన సంపూర్ణ సహకారం, భద్రత, భరోసా అందించడానికి తాము ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు. ఆదివాసీ యువత బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఒడిశాలోని ఆదివాసీ ప్రాంతంలో జన్మించిన మహిళ నేడు మన రాష్ట్రపతిగా సేవలందిస్తున్నారని.. ద్రౌపది ముర్ము వంటి వారిని యువతరం స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలని పిలుపునిచ్చారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.రామారావు మాట్లాడుతూ సమాజానికి చైతన్య దీపికలుగా యువతరం నిలవాలన్నారు. చైతన్యం లేని చోట దోపిడీ ప్రబలుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టం రూపకల్పన, అమలు, శిక్షలు తదితర అంశాలను విపులీకరించారు. అట్రాసిటీ చట్టం పటిష్టంగా అమలు చేయడానికి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం, న్యాయస్థానాలు చేస్తున్న కృషిని వివరించారు. విశాఖ జిల్లాలో అట్రాసిటీ కేసులు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయన్నారు. ఏయూ న్యాయ కళాశాల ఆచార్యులు చంద్రకళ మాట్లాడుతూ ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలు పెరిగిపోతున్నాయన్నారు. సమాజానికి యువతే ఆయుధమన్నారు. సామాజిక, ఆర్థిక న్యాయం అందరికీ చేరువ కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ, ఆర్వో(సీఐడీ) డాక్టర్ ప్రేమ్ కాజల్, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఏడీసీపీ(క్రైం) ఎం.మోహనరావు, విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు ఎస్.మాధవి, పి.మల్లేశ్వరరావు, శామ్యూల్, రాజబాబు, పూర్వ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నమ్మి శ్రీనివాసరావు, న్యాయవాది పాకా సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు.

సింహాచలంలో జల ధారలు సంరక్షించాలి

ధాన్ ఫౌండేషన్‌తో వీఎంఆర్‌డీఏ ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్, ధాన్ ఫౌండేషన్ సభ్యులు

విశాఖ సిటీ: సింహాచలంలో సహజ సిద్ధ జలధారల సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ పేర్కొన్నారు. శనివారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సింహాచలం కొండ శ్రేణుల్లో జలధారల పరిరక్షణపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జలధారల పరిరక్షణకు సంబంధించి ధాన్ ఫౌండేషన్‌తో వీఎంఆర్‌డీఏ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అనంతరం కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ సుస్థిర పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ధాన్ ఫౌండేషన్ ప్రతినిధి లోకేష్ మాట్లాడుతూ సింహాచలం కొండ ప్రాంతాల్లో 34 జలధారల్లో 18 ధారలను మ్యాపింగ్ చేసినట్లు చెప్పారు. ఇంకా నీటి వనరులు గుర్తించేందుకు స్థానిక గిరిజన వర్గాల సహకారాన్ని తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు మాట్లాడుతూ ఆలయ ఆచారాలతో పాటు పర్యావరణానికి ఈ జలధారలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని వివరించారు. ఆలయ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి ఈ ధారలను సంరక్షించుకోవడం చాలా అవసరమని చెప్పారు. ఇందుకోసం ముందుకొచ్చే సంస్థలతో పనిచేయడానికి దేవస్థానం సిద్ధం ఉందని స్పష్టం చేశారు. ఈ జలధారల సంరక్షణపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని వర్క్‌షాప్‌లో నిర్ణయించారు.

జియో ట్యాగ్ సర్వేకు సహకరించండి

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



డాబాగార్డెన్స్: వార్డు కార్యదర్శులతో ఇంటింటా చేపట్టిన జియో ట్యాగ్ సర్వేకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ కోరారు. జీవీఎంసీ కార్యాలయంలో జియో ట్యాగ్ సర్వేపై వార్డు కార్యదర్శులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇంటింటా నిర్వహిస్తున్న జియో ట్యాగ్ సర్వే ఇప్పటి వరకు 50 శాతం మాత్రమే పూర్తయ్యిందన్నారు. వార్డు కార్యదర్శులు సర్వే నిర్వహిస్తున్న సమయంలో వివరాల ఇవ్వడంతో ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని అధికారులు తెలిపారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ వార్డు కార్యదర్శులు గుర్తింపు కార్డుతో ప్రతి ఇంటికి వెళ్లి.. అవగాహన కల్పించిన తర్వాత సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకు ప్రజలకు సహకరించాలన్నారు. అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- జీసీసీ ఎండీ కల్పనా కుమారి



పోటీలను ప్రారంభిస్తున్న ఎండీ కల్పనా కుమారి

కొమ్మాది: బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని జన జాతి గౌరవ దివస్‌లో భాగంగా రుషికొండలోని గాయత్రి పీజీ, డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్(టీసీఆర్‌టీఎం) ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలను శనివారం జీసీసీ ఎండీ కల్పనా కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆనందంతో పాటు ఉల్లాసం కలిగిస్తాయన్నారు. ఈ పోటీల్లో 8 ఐటీడీఏలకు చెందిన 500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. కాగా.. వీరికి ఆర్చరీ, జావెలిన్ త్రో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా టీసీఆర్‌టీఎం ఆవరణలో ఏర్పాటు చేసిన గిరిజన సంతను జీసీసీ ఎండీ ప్రారంభించారు. ఇక్కడ వివిధ ఐటీడీఏలకు చెందిన గిరిజన రైతులు/చేతివృత్తుల వారు 10 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సంత ఈ నెల 26 వరకు జరగనుంది. టీసీఆర్‌టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణి మందా పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ప్రతిపాదిత ఓటర్ల జాబితాను శనివారం జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఈనెల 6వ తేదీ వరకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొత్తం 17,404 మంది దరఖాస్తు చేశారు. ఆన్‌లైన్ ద్వారా 4,802 మంది, ఆఫ్‌లైన్ ద్వారా 12,602 దరఖాస్తు చేశారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, మొత్తం 15,287 మందికి ఓటు హక్కు కల్పించారు. వీరిలో పురుషులు 9,638 మంది,స్త్రీలు 5,649 మంది ఉన్నారు. ఈ ముసాయిదాపై డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ప్రకటించిన ముసాయిదా జాబితాలో మార్పులు,చేర్పులకు వచ్చేనెల 9వ తేదీ వరకు www.coeandhra.nic.in అనే వెబ్‌సైట్‌లో కాని, సంబంధిత ఓటర్ల నమోదు అధికారికిగాని, సహాయ ఓటరు నమోదు అధికారులు లేదా ప్రత్యేక అధికారులకు గాని దరఖాస్తులను సమర్పించవచ్చు. ప్రచురించిన ముసాయిదా జాబితాలో అర్హులైన వారి పేరు నమోదు కాకపోతే కనీసం మూడేళ్ల బోధన అనుభవం గల ధ్రువీకరణ పత్రంతో పాటు అన్ని డాక్యుమెంట్లతో ఫారం-19 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యంతరాలను ఫారం-7 ద్వారా తెలియజేయాలి. జాబితాలో ఓటరు వివరాల మార్పుల కోసం ఫారం -8లో దరఖాస్తు చేయాలి.

ముసాయిదా జాబితాలో ఓటర్ల వివరాలు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
శ్రీకాకుళం	2,725	1,181	00	3,906
విజయనగరం	2,164	1,261	00	3,425
మన్యం పార్వతీపురం	1,267	595	00	1,862
అల్లూరి సీతారామరాజు	831	527	00	1,358
విశాఖపట్నం	1,426	1,421	00	2,847
అనకాపల్లి	1,225	664	00	1,889
మొత్తం	9,638	5,649	00	15,287

శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



డాబాగార్డెన్స్: అయ్యప్ప భక్తులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. 5, 6, 7 రోజుల శబరిమల ప్యాకేజీని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు ప్రకటించారు. అయ్యప్ప మాలధారుల కోసం ఇంద్ర, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని శబరిమల యాత్రికులు వినియోగించుకోవాలని కోరారు. విశాఖ జిల్లా నుంచే కాకుండా ఒడిశాలోని నొరంగపూర్, కోరాపుట్, జైపూర్ ప్రాంతాల నుంచి కూడా శబరిమలకు బస్సులు బయలుదేరుతాయని చెప్పారు.

ఐదు రోజుల యాత్ర

విశాఖలో బస్సు బయలుదేరి విజయవాడ, మేల్ మరవత్తూర్, ఎరుమేలి, పంబ మీదుగా సన్నిధానం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో శ్రీపురం, కాణిపాకం, తిరుపతి, విజయవాడ మీదుగా విశాఖపట్నం చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది. ప్రయాణ చార్జీలు(సూపర్ లగ్జరీ) ఒక్కరికి రూ.6,600.

ఆరు రోజుల యాత్ర

విశాఖలో బస్సు బయలుదేరి విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేళి, పంబ మీదుగా సన్నిధానం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, అన్నవరం మీదుగా విశాఖపట్నం చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది. ప్రయాణ చార్జీ(సూపర్ లగ్జరీ)లు ఒక్కరికి రూ.7వేలు.

ఏడు రోజుల యాత్ర

విశాఖలో బస్సు బయలుదేరి విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేలి, పంబ మీదుగా సన్నిధానం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధురై, రామేశ్వరం, తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, ద్వారపూడి, అన్నవరం మీదుగా విశాఖపట్నం చేరుకోవడంతో యాత్ర ముగుస్తుంది. ప్రయాణ చార్జీ(సూపర్ లగ్జరీ)లు ఒక్కరికి రూ.7,600.

ఎవరిని సంప్రదించాలి?

విశాఖ డిపో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్)	90522 27083
విశాఖ డిపో మేనేజర్	99592 25594
ద్వారకా బస్టేషన్ ఏటీఎం	91001 09731
కోఆర్డినేటర్ పీవీఎన్ రావు	73829 14219

హోటళ్లు ఫుల్.. అనుమతులు నిల్

- నగరంలో జీఎస్టీ, ట్రేడ్ లైసెన్సులు లేకుండా హోటళ్లు, లాడ్జీల నిర్వహణ
- 80 బృందాలతో 81 హోటళ్లు, లాడ్జీలు, 5 హాస్టళ్లలో తనిఖీలు
- 47 హోటళ్లు, లాడ్జీలకు ఫైర్ ఎన్‌వోసీలు లేనట్లు గుర్తింపు
- 22 హోటళ్లకు జీఎస్టీ, 11 హోటళ్లకు ట్రేడ్ లైసెన్సులు లేనట్లు నిర్ధారణ



లాడ్జీలో కస్టమర్ బ్యాగ్‌లు తనిఖీ చేస్తున్న పోలీసులు

విశాఖ సిటీ: నగరంలోని హోటళ్లు, లాడ్జిల్లో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అనేక హోటళ్లు, లాడ్జీలు జీఎస్టీ, ట్రేడ్ లైసెన్సు లేకుండా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్న విషయం బహిర్గతమైంది. ప్రధానంగా అనేక హోటళ్లకు ఫైర్ ఎన్‌వోసీలు, ఫుడ్ లైసెన్సులు లేకపోవడం గమనార్హం. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.

ఏకకాలంలో సోదాలు: ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జోన్-1, జోన్-2 పరిధిలో శనివారం తెల్లవారుజాము 5 నుంచి 11 గంటల వరకు ఏకకాలంలో ఈ సోదాలు నిర్వహించారు. 80 బృందాల్లో 270 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో నగరంలో ఉన్న 81 హోటళ్లు/లాడ్జిలు, 5 మెన్ హాస్టళ్లల్లో రికార్డులను సైతం పరిశీలించారు. ప్రధానంగా హోటళ్లలో అతిథుల జాబితాలో ఎవరైనా పరారీలో ఉన్న నిందితుల ఉన్నారా? వీసా గడువు ముగిసినా విదేశీ అతిథుల వివరాలు, మైనర్ జంటలు, అసాంఘిక కార్యకలాపాలు, మద్యం అమ్మకాలపై ఆరా తీశారు. పలు శాఖల అనుమతుల రికార్డులను పరిశీలించారు.

జీఎస్టీలు, ట్రేడ్ లైసెన్సులు లేకుండానే..

ఈ తనిఖీలో పలు శాఖాధికారులు నిర్లక్ష్యం బట్టబయలైంది. అనేక హోటళ్లు తప్పనిసరి అనుమతులు కూడా పొందకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్నట్టు నిర్ధారణ అయింది. ప్రధానంగా 47 హోటళ్లు, లాడ్జిలకు అగ్నిమాపక ఎన్‌వోసీలు, 22 హోటళ్లకు జీఎస్టీ సర్టిఫికెట్లు, 8 హోటల్/లాడ్జిలకు ట్రేడ్ లైసెన్సులు, 11 హోటళ్లకు ఫుడ్ లైసెన్సులు లేనట్లు గుర్తించారు. అదే విధంగా 30 హోటళ్లు, లాడ్జిల్లో విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్స్‌లో సందర్శకుల సమాచారాన్ని సక్రమంగా అప్‌డేట్ చేయకపోవడం, 36 హోటళ్లలో తనిఖీలకు ఉపయోగించే డీఎఫ్ఎండీ, హెచ్‌హెచ్ఎండీ, లగేజీ స్కానర్, అండర్ వెహికల్ చెకింగ్ మిర్రర్ లేకపోవడం, 5 హోటళ్లలో సీసీ కెమెరాలను పర్యవేక్షించడం లేదని గుర్తించారు. నిబంధనలు పాటించని పక్షంలో యాజమాన్యాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి హెచ్చరించారు.

చండీగఢ్ శుభారంభం

- మరో మ్యాచ్‌లో ఒడిశాపై విదర్భ గెలుపు
- సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ప్రారంభం



మ్యాచ్ బెస్ట్‌గా నిలిచిన కరణ్‌నాయర్

విశాఖ స్పోర్ట్స్: సయ్యద్ ముస్తాక్ అలీ(ఎస్ఎంఏ) ట్రోఫీలో చండీగఢ్ శుభారంభం చేసింది. ఈ టోర్నీలో భాగంగా వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియంలో శనివారం గ్రూప్ డీ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. ప్రారంభమ్యాచ్‌లో చండీగఢ్ టాస్ గెలిచి పుదుచ్చేరికి బ్యాటింగ్‌కు అప్పగించింది. నిర్ణీత 20 ఓవర్లలో పుదుచ్చేరి ఐదు వికెట్లు కోల్పోయి 183 పరుగులు చేసింది. ప్రతిగా చండీగఢ్ మరో ఐదు బంతులుండగానే ఐదు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. పుదుచ్చేరి కీపర్, ఓపెనర్ బ్యాటర్ అజయ్ రోహేరా(105) సెంచరీతో రాణించినప్పటికీ.. జట్టు ఓటమిపాలైంది. చండీగఢ్ నాలుగు పాయింట్లతో ఖాతా ప్రారంభించింది.

- డే నైట్‌గా జరిగిన మరో మ్యాచ్‌లో విదర్భ 33 పరుగుల తేడాతో ఒడిశాపై విజయం సాధించింది. ఒడిశా జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 216 పరుగులు చేసింది. ఓపెనర్ కరుణ్ నాయర్ 77 పరుగులు చేశాడు. ప్రతిగా ఒడిశా మరో ఐదు బంతులుండగానే 183 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ స్వస్తిక్ (63) అర్ధ సెంచరీతో రాణించాడు. ఈ విజయంతో విదర్భ నాలుగు పాయింట్లు సాధించింది. మ్యాచ్ బెస్ట్‌గా కరణ్‌నాయర్ నిలిచాడు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల నిమిత్తం విశాఖపట్నం నుంచి, విశాఖపట్నం మీదుగా నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నెల 25న విజయవాడ-విశాఖపట్నం-విజయవాడ(12718/12717) రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, కాకినాడ-విశాఖపట్నం-కాకినాడ(17267/17268) మెము ఎక్స్‌ప్రెస్, రాజమండ్రి-విశాఖపట్నం-రాజమండ్రి(07466/07467) స్పెషల్, గుంటూరు-విశాఖపట్నం(17239)సింహాద్రి ఎక్స్‌ప్రెస్, ఈనెల 26న విశాఖపట్నం-గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం-రాయ్‌పూర్ (08528)పాసింజర్ స్పెషల్ ఈ నెల 25, డిసెంబరు 2,9వ తేదీల్లోను, రాయ్‌పూర్-విశాఖపట్నం(085270 పాసింజర్ స్పెషల్ ఈ నెల 26, డిసెంబరు 3,10వ తేదీల్లో రద్దు చేశారు.

విజయలక్ష్మి సేవలు ప్రశంసనీయం



ప్రసంగిస్తున్న గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

విశాఖ లీగల్: న్యాయవాదిగా విజయలక్ష్మి సేవలు ప్రశంసనీయమని గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ అన్నారు. శనివారం జిల్లా కోర్టులోని నూతన భవనం న్యాయవాదుల సంఘం ఆవరణలో దివంగత ఎస్వీఆర్ విజయలక్ష్మి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదిగా విజయలక్ష్మి ఎన్నో పదవులు అధిరోహించడంతోపాటు న్యాయస్థానంలో తన ప్రతిభతో ఎన్నో కేసుల్లో విజయం సాధించారన్నారు. తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవనంద్ మాట్లాడుతూ విజయలక్ష్మితో సహచర న్యాయవాదిగా తన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఎంకే సీతారామయ్య కార్యాలయంలో జూనియర్‌గా ఆమె ఎంతో శ్రమించారన్నారు. ఢిల్లీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ రోహిణి మాట్లాడుతూ న్యాయవాదిగా విజయలక్ష్మి సేవలను కొనియాడారు. విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బేవరా సత్యనారాయణ, విజయలక్ష్మి కుటుంబ సభ్యులు, సీనియర్ న్యాయవాది లక్ష్మీ రాంబాబు, ఎంకే శ్రీనివాస్ ప్రసంగించారు.

సెమిస్టర్ పరీక్షలు వాయిదా

విశాఖ సిటీ: ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో ఈ నెల 29న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమావేశం నేపథ్యంలో ఏయూలో జరగాల్సిన బీఈ, బీటెక్ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు తెలిపారు. ఈ నెల 27, 28 29 తేదీల్లో జరగాల్సిన బీఈ/బీటెక్ 4/1 సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 30, డిసెంబర్ 2, 3 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరగనున్నట్లు వెల్లడించారు. అలాగే 27, 29 తేదీల్లో జరగాల్సిన బీఆర్క్ 5/1 పరీక్ష ఈ నెల 30, డిసెంబర్ 3వ తేదీన జరుగుతుందని వివరించారు.



అలరించిన గిరిజన నృత్యం

గజ్జె ఘల్లుమంది

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాలు ఎదురుగా శనివారం ఆదివాసీ స్వాభిమాన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ, ఆదివాసీ సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ సంయుక్తంగా మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నాయి. ముందుగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ జి.డి.వి.శంకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబిస్తూ చేసిన నృత్యాలు విశాఖ వాసులను, పర్యాటకులను ఆకట్టుకున్నాయి. కొమ్ము, థింసా, జానపద నృత్యాలు అలరించాయి. గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా ఐటీడీఏ పాడేరు, శ్రీశైలం, రంపచోడవరం, నెల్లూరు, చింతూరు, సీతంపేట ప్రాంతాల నుంచి ఆదివాసీలు తాము తయారు చేసిన, పండించిన ఉత్పత్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో విక్రయించారు. మిల్లెట్ ఉత్పత్తులు, వస్త్రాలు, వెదురు వస్తువులు, మట్టి కళారూపాలు, గిరిజన ప్రాంతాల్లో లభించే తేనె, వెదురు బొంగు చికెన్‌ను విశాఖ వాసులు కొనుగోలు చేశారు.



గిరిజన ప్రాంతాల్లోని తేనెను రుచి చూస్తున్న నగరవాసులు

విశాఖ యాదవులకు అన్యాయం

- కూటమి ప్రభుత్వానికి సత్తా చూపిస్తాం
- టీడీపీ నాయకుడు అల్లా అప్పలనారాయణ



బీచ్‌రోడ్డు: యాదవ కార్పొరేషన్‌లో విశాఖ పార్లమెంట్ నుంచి ఒక్కరికి కూడా అవకాశం కల్పించకపోవడం దారుణమని టీడీపీ నాయకుడు అల్లా అప్పలనారాయణ పేరుతో సోషల్ మీడియాలో ఓ ఆడియో వైరల్‌గా మారింది. టీడీపీ స్థాపించిన నాటి నుంచి ఎంతో మంది యాదవులు పార్టీకి అండగా ఉన్నారని, నాయకులు పార్టీలు మారినా.. కార్యకర్తలు మాత్రం టీడీపీతోనే ప్రయాణం సాగించారని అప్పలనాయుడు పేర్కొన్నారు. స్థానిక ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి, వంశీకృష్ణ, గణబాబు, పల్లా శ్రీనివాస్‌లు యాదవుల పేర్లు ఎందుకు సిఫార్సు చేయాలేదో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే సమావేశం నిర్వహించి.. కూటమి ప్రభుత్వానికి విశాఖ యాదవుల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. కాగా.. సోషల్ మీడియా ద్వారా కూటమి ఎంపీ, ఎమ్మెల్యేలను విమర్శించిన మరుసటి రోజే ఆయన రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. శనివారం సిరిపురం వద్ద ద్విచక్రవాహనంపై ఉన్న ఆయన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆయన ముఖంపై గాయాలయ్యాయి. ఈ ప్రమాదం ఎవరో కావాలనే చేశారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకుంటున్న 'విశేష' జ్యూయలరీ ప్రదర్శన



ఏయూక్యాంపస్: మహిళల మనసుకు నచ్చే డిజైనర్ ఆభరణాల ప్రదర్శనను వైభవ్ జ్యూయలర్స్ విశేష కలెక్షన్స్ పేరుతో ప్రారంభించింది. బీచ్‌రోడ్డులోని గ్రాండ్ బే హోటల్‌లో రెండు రోజుల ప్రదర్శనను ఎ.అలేఖ్య, కె.స్నేహ, వైభవ్ జ్యూయలర్స్ సీఎండీ భారత మల్లిక రత్నకుమారి, డైరెక్టర్ కీర్తన గ్రంధి ప్రారంభించారు. రూ.5 లక్షలలోపు ఇన్‌స్పైర్డ్, హ్యాండ్ క్రాఫ్టెడ్, క్యూరేటెడ్ డిజైనర్ డైమండ్ ఆభరణాలు, పేస్టెల్ ఆక్వా కలెక్షన్, విక్టోరియన్, గోల్డ్, ఏంటిక్, ఫ్యూజన్, సిజెడ్ డైమండ్ ఆభరణాల క్యూరేటెడ్ కలెక్షన్‌ను ఇక్కడ ప్రదర్శించారు. ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని వైభవ్ జ్యూవెలర్స్ చైర్‌పర్సన్ గ్రంధి మల్లికా మనోజ్ తెలిపారు.

అనుమతి లేని గ్రావెల్ తవ్వకాలకు రూ.2.09 కోట్ల జరిమానా

తగరపువలస: ఆనందపురం మండలం కొంత్యాం పంచాయతీ సర్వే నంబర్ 123, 347లో అనుమతి లేకుండా తవ్వి, తరలించిన గ్రావెల్‌కు గాను జిల్లా గనులు, భూగర్భశాఖ భారీ జరిమానా విధించింది. ఆ జరిమానా కట్టాలని సంబంధిత వ్యక్తులకు ఈ నెల 13న డిమాండ్ నోటీసు పంపారు. సమాచార హక్కు చట్ట ప్రకారం అందిన ఫిర్యాదు మేరకు కార్యాలయ రాయల్టీ ఇన్‌స్పెక్టర్, జిల్లా నిఘా విభాగపు రాయల్టీ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో, సర్వేయర్లు గ్రావెల్ తరలించినట్టు నిర్ధారించారు. సదరు సర్వే నంబర్ల నుంచి 63,495 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలించినందుకు గాను రూ.2.09 కోట్ల జరిమానా కట్టాలని జిల్లా అధికారులు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.